సాక్షి
నిర్మల్
బుధవారం : 26 : జూన్ : 2024



ఎంపీల ప్రమాణ స్వీకారం

ఆదిలాబాద్/చెన్నూర్: ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మంగళవారం పార్లమెంటులో ప్రమాణ స్వీకారం చేశారు. ప్రొటెం స్పీకర్ రాధామోహన్ సింగ్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. గోడం నగేశ్ హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. గడ్డం వంశీకృష్ణ సింగరేణి పారిశ్రామిక ప్రాంత ప్రాముఖ్యతను తెలియజేస్తూ సింగరేణి కార్మికుడి డ్రెస్‌లో ప్రమాణ స్వీకారం చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. ఇంగ్లిషులో ప్రమాణ స్వీకారం చేశారు.



న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన ఖానాపూర్ ఎమ్మెల్యే



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే

ఖానాపూర్: కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అభిలాష అభినవ్‌ను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు దయానంద్, నిమ్మల రమేశ్, నాయకులు వెంకాగౌడ్, పరిమి సురేశ్, లక్ష్మీపతిగౌడ్, అలెగ్జాండర్, ప్రొద్దుటూరి సతీశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రైతులకు భరోసా కల్పిస్తాం



రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్న డీఏవో

కుంటాల: రైతుల అభిప్రాయం మేరకే అర్హులైన రైతులకు రైతు భరోసా కింద పెట్టుబడిసాయం అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా ప్లానింగ్ మిషన్ మెంబర్ చిన్నారెడ్డి, వ్యవసాయ సలహా సంఘం సభ్యులు కోదండరాంరెడ్డి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపితో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా రైతులతో ముఖాముఖి మాట్లాడారు. కుంటాల రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ పాల్గొని వానాకాలం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవోలు సోమలింగారెడ్డి, రాంచందర్ నాయక్, వికార్ హైమద్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

భైంసాటౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏఐఎస్‌బీ(ఆలిండియా స్టూడెంట్ బ్లాక్) కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు జివారే రాహుల్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఏఐఎస్‌బీ 74వ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సంఘం పని చేస్తుందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కపిల్, విద్యార్థులు పాల్గొన్నారు.


నేడు ప్రైవేట్ పాఠశాలలు బంద్



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

నిర్మల్ రూరల్: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను అరికట్టాలని బుధవారం జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఏబీవీపీ కన్వీనర్ శివకుమార్ తెలిపారు. ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.పాఠశాలవిద్యలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్ తలపెట్టినట్లు పేర్కొన్నారు.

ఎస్సారెస్పీ భూముల్ని సర్వే చేయిస్తాం



మాట్లాడుతున్న ఆర్డీవో కోమల్‌రెడ్డి

లోకేశ్వరం: ఎస్సారెస్పీలో ముంపునకు గురైన భూములను సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయిస్తామని భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి అన్నారు. మంగళవారం గడ్చాందలో గ్రామస్తులతో మాట్లాడారు. ముంపు భూముల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ మోతీరాం, ఎస్సై మోహన్‌రావు, ఆర్‌ఐ బాలకృష్ణ, సర్వేయర్ నరేందర్, గ్రామస్తులు ఉన్నారు.

భైంసా డిగ్రీ కళాశాలకు మహర్దశ..!

భైంసా జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీఎం ఉష పథకానికి ఎంపికైంది. ఈ మేరకు కళాశాల అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరయ్యాయి.

- వివరాలు 8లో

మొక్కు 'బడి'బాట..!



ఎల్లపెల్లిలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు(ఫైల్)

- బదిలీలు, పదోన్నతుల ఎఫెక్ట్
- ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన ప్రవేశాలు
- గతేడాదితో పోలిస్తే పడిపోయిన అడ్మిషన్లు..

నిర్మల్ రూరల్/మామడ: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు ప్రభుత్వం ఏటా బడిబాట కార్యక్రమం నిర్వహిస్తుంది. ఈ ఏడాది కూడా ఈనెల 3వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సి ఉన్నా లోక్‌సభ ఎన్నికల ఫలితాల కారణంగా 6వ తేదీ నుంచి 19వ తేదీ వరకు నిర్వహించింది. సర్కారు బడుల్లో ప్రవేశాలు పెంచడం లక్ష్యంగా రాష్ట్ర విద్యా శాఖ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. దీనికోసం ప్రత్యేకంగా నిధులు కూడా విడుదల చేసింది. అయితే ఈ విద్యా సంవత్సరం బడిబాట కార్యక్రమం జిల్లాలో ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వలేదు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ కొనసాగుతుండడంతో ఉపాధ్యాయులు పూర్తిగా బడిబాటపై దృష్టి సారించలేదు. దీంతో ప్రభుత్వ బడుల్లో గతేడాది కన్నా ఈసారి ప్రవేశాలు తగ్గాయి.

2,155 ప్రవేశాలు...

జిల్లాలో 533 ప్రభుత్వ ప్రాథమిక, 85 ప్రాథమికోన్నత, 117 ఉన్నత పాఠశాలలు,18 కేజీబీవీలతోపాటు గిరిజన,సాంఘిక సంక్షేమ పాఠశాలలు కలిపి 835 పాఠశాలలు ఉన్నాయి. వీటన్నింటిలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అన్ని గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటి ప్రచారం, ర్యాలీలు తదితర కార్యక్రమాలు చేపట్టారు. 14 రోజులపాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 2,155 మంది విద్యార్థులను బడిలో చేర్పించారు. ఇందులో అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ఒకటవ తరగతిలో 1,385 మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకోగా, 389 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. 12 మంది డ్రాపౌట్ విద్యార్థులను తిరిగి చేర్పించారు. అయితే గతేడాది 3,661 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. గత విద్యాసంవత్సరం ప్రవేశాలతో పోలిస్తే 1,506 మంది విద్యార్థులు తగ్గారు. దస్తురాబాద్, ఖానాపూర్, కుభీర్, కుంటాల, నిర్మల్‌అర్బన్, నిర్మల్‌రూరల్, పెంబి, లక్ష్మణచాంద, నర్సాపూర్(జి) మండలాల్లో ప్రవేశాలు బాగా తగ్గాయి. బడిబాట కార్యక్రమం ముగిసినా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు ఇంకా అవకాశం ఉందని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు.

తగ్గిన ప్రవేశాల సంఖ్య..

ఈసారి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య తగ్గింది. ఉపాధ్యాయులకు ప్రమోషన్, ట్రాన్స్‌ఫర్‌ల షెడ్యూల్ ఉండడంతో అందులోనే వారంతా బిజీబిజీగా ఉన్నారు. దీంతో అడ్మిషన్లపై దృష్టి సారించలేకపోయారు. కోర్టు తీర్పు ఎలా వస్తుంది? ఎక్కడ తీసుకుంటే బాగుంటుంది? పదోన్నతులు ఎవరెవరికి వస్తాయి? ఏ స్కూల్ అయితే బాగుంటుంది? తదితర అంశాలపై ఉపాధ్యాయులు ఎక్కువగా దృష్టి పెట్టారు. దీంతో బడిబాటను ఒకటి రెండు రోజులు ర్యాలీలతో సరిపెట్టారు. షెడ్యూల్ ప్రకారం బడిబాట నిర్వహించలేదనే ఆరోపణలు వస్తున్నాయి. అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులను పూర్తిస్థాయిలో భాగస్వామ్యం చేయకపోవడంతో ఆశించిన ఫలితాలు రాలేదు. గతేడాది జూన్ 3 నుంచి 30వ తేదీ వరకు 27 రోజులపాటు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించగా, ఈసారి కేవలం 14 రోజులు మాత్రమే నిర్వహించడం కూడా ప్రవేశాలు తగ్గడానికి ఓ కారణమని ఉపాధ్యాయవర్గాల్లో చర్చ జరుగుతోంది.

మండలాల వారీగా ప్రవేశాల వివరాలు..

మండలం	గతేడాది	ప్రస్తుతం
బాసర	80	161
భైంసా	372	304
దస్తురాబాద్	96	67
దిలావర్‌పూర్	199	70
కడెం	173	118
ఖానాపూర్	281	22
కుభీర్	167	14
కుంటాల	154	23
లక్ష్మణచాంద	127	119
లోకేశ్వరం	166	115
మామడ	231	96
ముధోల్	216	117
నర్సాపూర్(జి)	163	14
నిర్మల్ రూరల్	174	201
నిర్మల్ అర్బన్	176	32
పెంబి	99	35
సారంగాపూర్	367	231
సోన్	118	149
తానూర్	303	267
మొత్తం	3,661	2,155

సౌకర్యాలపై అవగాహన



ఈ నెల 6 నుంచి 19 వరకు ప్రతీ పాఠశాల పరిధిలో బడిబాట కార్యక్రమం నిర్వహించాం. పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలను ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు గ్రామస్తులకు, పోషకులకు వివరించారు. ఐదేళ్లు నిండిన ప్రతీ విద్యార్థిని పాఠశాలలలో చేర్పించేలా చూడాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించాం. – రవీందర్‌రెడ్డి, డీఈవో

'పెద్దాస్పత్రి'.. పర్యవేక్షణ



పేషెంట్లతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, పక్కన వైద్య సిబ్బంది

- 'సాక్షి' కథనానికి కలెక్టర్ స్పందన
- పర్యవేక్షించాలని అడిషనల్ కలెక్టర్‌కు ఆదేశం
- జనరల్ ఆస్పత్రిని తనిఖీ చేసిన ఫైజాన్‌అహ్మద్
- రికార్డులు పరిశీలించి, వైద్యసేవలపై ఆరా

సాక్షి స్పందన

నిర్మల్: జనరల్ ఆస్పత్రి నుంచి పేషెంట్లను ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో 'సాక్షి' దినపత్రిక 'పేరుకే పెద్దాస్పత్రి' కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ అభిలాష అభినవ్ స్పందించారు. జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో వైద్యసేవలు అందుతున్న తీరును పరిశీలించాలంటూ అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు) ఫైజాన్‌అహ్మద్‌ను ఆదేశించారు. ఈమేరకు ఆయన మంగళవారం మధ్యాహ్నం ఆకస్మికంగా ఆస్పత్రిని తనిఖీ చేశారు. త్వరలో కలెక్టర్ ఆస్పత్రిని తనిఖీ చేస్తారని పేర్కొన్నారు.

పరిశీలించి.. సమస్యలపై ఆరాతీసి..

కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం మధ్యాహ్నం అడిషనల్ కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ జనరల్ ఆస్పత్రికి వచ్చారు. రాగానే ఆస్పత్రి ప్రాంగణమంతా కలియ తిరుగుతూ పరిశీలించారు. అనంతరం వార్డుల్లో పేషెంట్ల వద్దకు వెళ్లి వైద్యసేవలు అందుతున్న తీరు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి విద్యుత్ సరఫరాలో లోపాలు, జనరేటర్, ఆక్సిజన్ ప్లాంట్ పనితీరుపై ఆరాతీశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. పేషెంట్లకు కావాల్సిన మందులు అందుబాటులో ఉన్నాయా.. లేదా.. అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, వైద్యసిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా.. అని అడిగారు. ఇక్కడి సమస్యలు, తెలుసుకున్న వివరాలను కలెక్టర్‌కు వివరిస్తామని ఆయన పేర్కొన్నారు. అలాగే కలెక్టరేట్‌లో ప్రతిరోజూ గ్రీవెన్స్ ఉంటుందని జనరల్ ఆస్పత్రిలో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌కుమార్, ఇతర సిబ్బంది ఉన్నారు.



ల్యాబ్‌లో బ్లడ్‌శాంపిల్ ఇస్తున్న అడిషనల్ కలెక్టర్

పేద విద్యార్థులకు ఆర్థికసాయం

- ఔదార్యం చాటిన డాక్టర్ రమణేశ్వర్–స్రవంతి దంపతులు

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ కుంట రమణేశ్వర్–స్రవంతి దంపతులు ఆరేళ్లుగా పేద విద్యార్థులను గుర్తించి వారికి ఏటా ఆర్థిక చేయూతనందిస్తున్నారు. మృతి చెందిన తమ కూతురు ఆరాధ్య జ్ఞాపకార్థం ఈ సంవత్సరం కూడా దాదాపు 12 మంది పేద విద్యార్థులను గుర్తించి ఆర్థికసాయం అందించారు. నిర్మల్‌లోని డాక్టర్ కావేరి కుటీరంలో చిన్నారి 'కుంట ఆరాధ్య' 10వ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కావేరి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ అప్పాల చక్రధారి మాట్లాడుతూ.. పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు చెందిన చిన్నారులను గుర్తించి చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. డాక్టర్ రమణేశ్వర్ వైద్య వృత్తిలో రాణిస్తూనే మరోవైపు సామాజిక నిబద్ధతతో సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆర్థికసహాయం పొందినవారిలో కార్తీక్, కౌశల్ అనే విద్యార్థుల ఉన్నత చదువుల నిమిత్తం రూ.45 వేలు, జీవితబీమా, బాల్కొండలోని మహతి అనాథాశ్రమానికి రూ.30 వేలు, బేస్తవారిపేటకు చెందిన భరత్‌రాజ్‌కు రూ.10 వేలు, లక్ష్మికి రూ.10 వేలు డిగ్రీ చదువుతున్న రుత్వికకు రూ.10 వేలు, చించోలి గ్రామానికి చెందిన భావనకు రూ.5 వేలు, సాయిదివ్యకు రూ.5 వేలు, పార్డీ-బి గ్రామానికి చెందిన బుద్ధ భూషణ్‌కు రూ.10 వేలు, పొనకల్ గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ అభ్యసిస్తున్న రోజా అనే విద్యార్థినికి రూ.15 వేలు, నాయుడువాడకు చెందిన అఖిలకు రూ.5 వేలు, సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన తేజస్వినికి రూ.10 వేల చొప్పున నగదు అందజేశారు. కార్యక్రమంలో తుమ్మల దేవరావు, కామారపు జగదీశ్వర్, డాక్టర్ రామకృష్ణ, కుంట భూమన్న, డాక్టర్ ప్రశాంత్, అప్పాల మహేశ్, అప్పాల ప్రభాకర్, అప్పాల శశికళ, మైస అరవింద్, పోలీస్ భీమేష్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న రమణేశ్వర్ దంపతులు

సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ పాసైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు సివిల్స్ లాంగ్‌టర్మ్ ఉచిత శిక్షణ(ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్)కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ అభివృద్ధి అధి కారి వి.రాజేశ్వర్‌గౌడ్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 19 నుంచి జూలై 3వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తరగతులు జులై 18 నుంచి వచ్చే సంవత్సరం ఏప్రిల్ 18 వరకు కొనసాగుతాయని వెల్లడించారు. మొత్తం 150 మంది అభ్యర్థులకు 100 మందిని జూలై 7న నిర్వహించే ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. మరో 50 మంది అభ్యర్థులను గతంలో యూపీఎస్సీ నిర్వహించిన సివిల్ సర్వీసెస్(ప్రిలిమ్స్) పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారిని తీసుకుంటామని వివరించారు. వారు సంబంధిత పత్రాలతో ఈనెల 3లోగా నేరుగా టీజీబీసీ స్టడీ సర్కిల్ లక్ష్మీనగర్ కాలనీ, సైదాబాద్, హైదరాబాద్ 500059 నందు దరఖాస్తు సమర్పించాలన్నారు. ప్రవేశంపొందిన అభ్యర్థులకు లాడ్జింగ్, భోజన, రవాణా ప్రయోజనం కోసం నెలకు రూ.5 వేలు, బుక్ ఫండ్ నిమిత్తం రూ.5 వేలు ఒక్కసారి ఇస్తారు. గ్రంథాలయ సదుపాయం కూడా కల్పించడం జరుగుతుంది. ఈ ఉచిత శిక్షణ హైదరాబాదులో ఇవ్వ డం జరుగుతుందని అభ్యర్థులు ఆన్‌లైన్‌లో కులం, ఆదాయం, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్లతో దరఖా స్తు చేసుకోవాలని సూచించారు. అర్హులు www. tgbcstudy circle.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 0873 2221280 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉచిత గ్రాండ్ టెస్టులకు దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్‌చైన్‌గేట్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని టీజీపీఎస్సీ గ్రూప్–2 ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఉచిత గ్రాండ్ టెస్ట్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని బీసీ అభివృద్ధి అధికారి వి.రాజేశ్వర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం నాలుగు గ్రాంట్ టెస్టులలో మొదటి గ్రాండ్ టెస్ట్ జూలై 8వ తేదీ ఉదయం 10 గంటలకు పేపర్–1 మధ్యాహ్నం 1.30కి పేపర్ 2, 9వ తేదీ ఉదయం 10 గంటలకు పేపర్–3 మధ్యాహ్నం 1.30కి పేపర్–4, రెండవ గ్రాండ్ టెస్టులు జూలై 15వ తేదీ ఉదయం 10 గంటలకు పేపర్–1, మధ్యాహ్నం 1.30కి పేపర్ 2, 16వ తేదీ ఉదయం 10 గంటలకు పేపర్–3, మధ్యాహ్నం 1.30కి పేపర్–4 నిర్వహిస్తారు. మూడో గ్రాండ్ టెస్టు జూలై 22న ఉదయం 10 గంటలకు పేపర్–1 మధ్యాహ్నం 1.30కి పేపర్–2, 23వ తేదీ ఉదయం 10 గంటలకు పేపర్– 3 మధ్యాహ్నం 1.30కి పేపర్–4 నిర్వహిస్తారు. నాలుగో గ్రాండ్ టెస్ట్ జూలై 30న ఉదయం 10 గంటలకు పేపర్–1 మధ్యాహ్నం 1.30కి పేపర్–2, 31వ తేదీ ఉదయం 10 గంటలకు పేపర్–3 మధ్యాహ్నం 1.30కి పేపర్–4 నిర్వహిస్తామని వివరించారు. అర్హులైన అభ్యర్థులు www. tgbcstudycircle. cgg. gov. in ఆన్‌లైన్ ద్వారా ఈనెల 19 నుంచి జూలై 5 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 08732221280 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

చీకటి రోజుకు 50 ఏళ్లు



కార్యక్రమంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్

- బీజేపీ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్



కార్యక్రమానికి హాజరైన బీజేపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే 1975, జూన్ 25 ఒక 'చీకటి రోజు'గా నిలిచిపోయిందని బీజేపీ రాష్ట్ర నాయకులు బండారి శాంతికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఆనాటి ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన వీరులను, ఉద్యమకారులను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1977 మార్చి 21 వరకు ఇందిరాగాంధీ రాజకీయ ప్రత్యర్థులను జైలుపాలు చేసి పత్రికలను సెన్సార్ చేశారన్నారు. వాస్తవాలు చెప్పేందుకు ప్రయత్నించిన పత్రికలపై తీవ్ర నిర్బంధం విధించారని, ప్రశ్నించే మేధావులు, పాత్రికేయుల గొంతునొక్కారని, ఎన్నో సంస్థలను రద్దు చేశారని విమర్శించారు. ఇదే రోజున నాటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ దేశంలో అంతర్గత అస్థిరతను, అశాంతిని కారణంగా చూపుతూ జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటించి, భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను తుంగలో తొక్కారన్నారు. అటల్ బిహారీవాజ్‌పేయి, మొరార్జీ దేశాయ్, బిజూ పట్నాయక్, చంద్రశేఖర్ లాంటి మరెందరో ప్రముఖులతోసహా లక్ష మందికి పైగా ప్రజలను నిర్బంధించి జైళ్లలో పెట్టారన్నారు. ఎన్నికలు వాయిదా వేయడం, ప్రభుత్వ వ్యతిరేక నిరసనలను ఉక్కుపాదంతో అణచివేయడం, పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలు విధించడంతోపాటు కొన్ని చట్టాలను ప్రభుత్వానికి అనుకూలంగా మార్చడం జరిగిందన్నారు. 'ఎమర్జెన్సీ' అంటే ఇందిరా గాంధీకి ఒక పర్యాయపదంగా మారిపోయిందన్నారు. దాదాపు 21 నెలలపాటు అమలులో ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, సీనియర్ నాయకులు రావుల రామనాథ్, సత్యనారాయణగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు సామ రాజేశ్వర్‌రెడ్డి, మెడిసెమ్మె రాజు, నిర్మల్ అసెంబ్లీ కన్వీనర్ శ్రీగాదె విలాస్, జిల్లా ఉపాధ్యక్షులు కమల్ నయన్, తలోడ్ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, పట్టణ అధ్యక్షుడు సాదం అరవింద్, బీజేవైఎం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు అర్జున్, మహిళా మోర్చా అధ్యక్షులు రజినీ వైద్య, పలు మండలాలు, డివిజన్ల ఇన్‌చార్జీలు, అధ్యక్షులు ఉద్యమకారులు, వివిధ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి



నిర్మల్ కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: మండలంలోని ఎక్బాల్‌పూర్ గ్రామంలో 30 ఏళ్లుగా సాగుచేసుకుంటున్న పోడు సాగుదారులకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని సీపీఐఎంఎల్(న్యూడెమోక్రసి) ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టరేట్ కిశోర్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం గ్రామాల్లోని పోడు భూములపై సరైన సర్వే చేయకపోవడంతో ఎంతోమంది పోడు పట్టాలు రాక నష్టపోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోడు భూములపై గ్రామస్థాయిలో సమగ్ర సర్వే చేసి పట్టాలు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో రైతులు లింగన్న, దేవేందర్, జేవింద్, గోపిచంద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర నామ మాత్రమే



మాట్లాడుతున్న నాయకులు పద్మ

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర ప్రభుత్వం పంటలకు నామమాత్రంగా మద్దతు ధర ప్రకటించిందని, కేంద్రం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానానికి ఇది నిదర్శనమని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ విమర్శించారు. రైతు సంఘం జిల్లా సమావేశం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో ఎస్ఎన్.రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పశ్య పద్మ మాట్లాడుతూ 14 రకాల పంటలకే మద్దతు ధర ప్రకటంచడం శోచనీయమన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వాలన్నారు. పల్సీరంగారావ్ ప్రాజెక్టు కారణంగా గుండెగావ్ గ్రామం ఏటా మునుగుతున్నందున గడ్డెన్న వాగుకు పిల్ల కాలువలు నిర్మించాలన్నారు. యస్.విలాస్ మాట్లాడుతూ పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో చిల్కా దేవిదాస్, కంజర్ల భూమయ్య, రాజేశ్వర్, టి.మల్కన్న, రాష్ట్రపాల్, వాడుకరి లక్ష్మణ్, తోకల విశ్వనాథ పాల్గొన్నారు.

రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌ను కలిసిన 'పత్తిరెడ్డి'



వినతిపత్రం అందజేస్తున్న రాజేశ్వర్‌రెడ్డి

నిర్మల్ రూరల్: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు విడుదల చేయాలని కోరుతూ జెడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్యను హైదరాబాద్‌లో కలిశారు. గ్రామపంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ పెండింగ్ బిల్లులు త్వరగా విడుదల చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో పెండింగ్ బిల్లులు ఉన్నాయని వివరించారు.

క్లుప్తంగా

రైల్వే క్వార్టర్స్‌లో నాగుపాము హల్‌చల్



పామును పట్టుకున్న ఫయాజ్..

బాసర : మండల కేంద్రంలోని రవీంద్రాపూర్ కాలనీలోని రైల్వే క్వార్టర్స్‌లో నాగుపాము మంగళవారం హల్‌చల్ చేసింది. పాము కనిపించడంతో కాలనీవాసులు ఆందోళన చెందారు. వెంటనే పాములు పట్టే వ్యక్తి ఫయాజ్‌కు సమాచారం అందించారు. అతను వచ్చి పామును పట్టుకోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. వర్షాకాలం దృష్ట్యా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

మేకల మందపై కుక్కల దాడి



కుక్కల దాడిలో మృతి చెందిన మేకలు

తాంసి: మండలంలోని పాలోది గ్రామ శివారులో మేత కోసం వెళ్లిన మేకల మందపై కుక్కలు మంగళవారం దాడి చేశాయి. గ్రామానికి చెందిన నేరెళ్ల రవి మేకల మందను తీసుకొని గుట్టకు మేతకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో అక్కడ గుంపుగా ఉన్న కుక్కలు మందపై దాడి చేశాయి. ఈ ఘటనలో మూడు మేకలు చనిపోయాయి. మరో నాలుగు తీవ్రంగా గాయపడగా వాటికి పశువైద్య సిబ్బంది ప్రవీణ్ వైద్యం అందించారు. చనిపోయిన మేకల విలువ రూ.30వేల వరకు ఉంటుందని కాపరి రవి తెలిపాడు. ప్రభుత్వం తరఫున పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అంకుసాపూర్ రోడ్డు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. మృతుడికి సుమారు 50 సంవత్సరాలు ఉంటాయని, ఎలాంటి ఆధారాలు లభించలేదని, శరీరంపై ఎలాంటి గాయాలు లేవని పేర్కొన్నారు. మృతదేహాన్ని సిర్పూర్(టి)లోని మార్చురీకి తరలించామని తెలిపారు. ఎవరైనా గుర్తుపడితే రూరల్ పోలీసులను సంప్రదించాలని ఎస్సై కోరారు.

భైంసా డిగ్రీ కళాశాలకు మహర్దశ..!

- పీఎం ఉష కింద రూ.5 కోట్లు మంజూరు
- వసతుల కల్పనతో విద్యార్థులకు ప్రయోజనం



భైంసాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీఎం ఉష(ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్ష అభియాన్) పథకానికి ఎంపికైంది. ఈ మేరకు కళాశాల అభివృద్ధికి రూ.5 కోట్లు నిధులు కేటాయిస్తూ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ప్రొసీడింగ్స్ జారీ చేశారు. న్యాక్ గుర్తింపు ఉన్న పలు కళాశాలలను జాతీయస్థాయిలో ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఎంపికచేసి అభివృద్ధి చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రం నుంచి 65 కళాశాల ఎంపికకు ప్రతిపాదనలు పంపగా, వీటిలో 13 కళాశాలలను ఎంపిక చేస్తూ నిధులు కేటాయించింది. ఇందులో భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాల చోటు దక్కించుకుంది. ఫలితంగా పీఎం-ఉష కింద కళాశాలలో విద్యార్థులకు నూతనంగా తరగతి గదుల నిర్మాణం, ఇతర మరమ్మతులు, ఫర్నిచర్, కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ బోర్డులు,వసతులు అందుబాటులోకి రానున్నాయి.

అధ్యాపక బృందం కృషితో...

భైంసా పట్టణంలో పార్డి(బి) బైపాస్‌రోడ్‌లో జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1995లో ఏర్పాటైంది. మొదట బీఏ, బీకాం కోర్సులతో కళాశాల ప్రారంభం కాగా, 2005 బీఎస్సీ, 2018లో ఉర్దూ, ఇంగ్లిష్ మీడియంలో బోధన ప్రారంభించారు. అదే సంవత్సరం కంప్యూటర్ సైన్స్ కోర్సు కూడా అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ మీడియంలో కలిపి మొత్తం 600 మంది విద్యార్థులు ఉన్నారు. కళాశాల ఏర్పడిన దాదాపు 25 ఏళ్ల వరకు న్యాక్ గుర్తింపు పొందలేదు. దీంతో ప్రస్తుత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుధాకర్ నేతృత్వంలోని అధ్యాపక బృందం విశేష కృషితో 2021-22లో న్యాక్ బి గ్రేడ్ గుర్తింపు దక్కించుకుంది. ఉన్నత విద్యామండలి నిధులు కేటాయించాలంటే న్యాక్ గుర్తింపు తప్పనిసరి. దీన్ని గుర్తించిన అధ్యాపకులు ఈ మేరకు కళాశాలకు న్యాక్ గుర్తింపు కోసం కలిసికట్టుగా పనిచేశారు. దాతల సహకారంతో కళాశాలలో వసతుల కల్పన, కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు, పూర్తిస్థాయిలో బోధనా సిబ్బంది అందుబాటులో ఉంచడంతో న్యాక్ సంస్థ గుర్తించి బి గ్రేడ్ ఇచ్చింది. న్యాక్ గుర్తింపు ఉండడంతో పీఎం-ఉష కింద కళాశాలలో వసతుల కల్పనకు రూ.5 కోట్లతో ప్రిన్సిపాల్ సుధాకర్ ప్రతిపాదనలు పంపగా, ఆమోదించిన కేంద్రం ఈ మేరకు నిధులు కేటాయించింది.

ప్రజాప్రతినిధులు, నాయకులు దృష్టి సారించాలి..

భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. స్థానికంగా కళాశాలల్లో సరైన వసతులు లేకపోవడంతో నియోజకవర్గం నుంచి ఎంతోమంది విద్యార్థులు ఉన్నత విద్య కోసం నిజామాబాద్, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్తున్నారు. స్థానిక డిగ్రీ కళాశాల ప్రస్తుతం పీఎం-ఉష కింద ఎంపికైన నేపథ్యంలో అదనపు తరగతి గదులు, ఫర్నిచర్, కంప్యూటర్ టేబుళ్లు, రీడింగ్ టేబుళ్లు, డ్యూయల్ డెస్కులు, ప్రొజెక్టర్లు, ఇతర వసతులు అందుబాటులోకి రానున్నాయి. అయితే, స్థానికంగా డిగ్రీ కళాశాలకు అనుసంధానంగా బాలికల కోసం హాస్టల్ మంజూరు చేసేలా ప్రజాప్రతినిధులు, నాయకులు కృషి చేయాలని అధ్యాపకులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. తద్వారా కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగి న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు వచ్చే అవకాశముందని చెబుతున్నారు.

సెమినార్లతో జాతీయస్థాయి గుర్తింపు...

మారుమూల ప్రాంతంలో ఉన్న భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు జాతీయస్థాయిలో గుర్తింపు తేవాలనుకున్న అధ్యాపక బృందం ఇందుకుగాను జాతీయస్థాయి సెమినార్లను నిర్వహించాలని నిర్ణయించింది. తొలుత వృక్షశాస్త్రం అధ్యాపకులు డాక్టర్ వెల్మల మధు ఆధ్వర్యంలో ఒకరోజు జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు దేశంలోని వివిధ యూనివర్సిటీల నుంచి ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పరిశోధన విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం హిందీ, ఆర్థిక శాస్త్రం ఆధ్వర్యంలో సైతం జాతీయస్థాయి సెమినార్లు నిర్వహించారు. ఫలితంగా భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చింది. ఫలితంగా ప్రస్తుతం పీఎం-ఉష కింద ఎంపికకు దోహదపడింది.

ఆనందంగా ఉంది...



భైంసా డిగ్రీ కళాశాల పీఎం ఉష పథకం కింద ఎంపికైంది. రూ.5 కోట్లు మంజూరు చేయడం ఆనందంగా ఉంది. కళాశాలకు న్యాక్ గుర్తింపు కోసం అధ్యాపక బృందం విశేషంగా కృషి చేసింది. జాతీయస్థాయి సెమినార్లు నిర్వహించడం, పీహెచ్‌డీ చేసిన అధ్యాపకులు ఉండడంతో కళాశాలకు గుర్తింపు వచ్చింది. దీంతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, దాతల సహకారంతో విద్యార్థులకు మెరుగైన విద్య, వసతులు కల్పించేందుకు కృషి చేస్తాం.

– డాక్టర్ ఎం.సుధాకర్, ప్రిన్సిపాల్, భైంసా

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



కుమ్మరి సాయన్న(ఫైల్)

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి గ్రామానికి చెందిన కుమ్మరి సాయన్న(55) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. లోకేశ్వరం ఎస్సై మోహన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్మరి సాయన్న తన బైక్‌పై ఖాళీ గ్యాస్ సిలిండర్ తీసుకుని పంచగుడికి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. లోకేశ్వరం గ్రామ శివారులో బైక్ అదుపు తప్పడంతో కల్వర్టును ఢీకొని కిందపడ్డాడు. అతడి తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. మృతుడికి భార్య గంగవ్వ, కుమార్తెలు సంగీత, స్వప్న ఉన్నారు. స్వప్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిర్మల్‌లో ఆగని కుక్కల దాడులు

నిర్మల్‌టౌన్: నిర్మల్‌లో వీధికుక్కల దాడులు కొనసాగుతున్నాయి. వారం వ్యవధిలో నాలుగుసార్లు దాడులు చేశాయి. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఓ వ్యక్తి సోమవారం రాత్రి విధులను ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో కుక్కలు ఒకసారి దాడిచేసి గాయపరిచాయి. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పట్టణంలో నిత్యం ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా అధికారులు కుక్కల తరలింపునకు చర్యలు చేపట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వీధికుక్కల తరలించాలని డిమాండ్ చేస్తున్నారు.

సీసీఐ క్వార్టర్స్‌లో చోరీ



వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో గల సీసీఐ క్వార్టర్స్‌లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు నర్సింహస్వామి తెలిపిన ప్రకారం.. సీసీఐ యాజమాన్యం నుంచి తమకు రావాల్సిన డబ్బులు రాకపోవడంతో క్వార్టర్‌లోనే ఉంటున్నట్లు తెలిపాడు. ఇటీవల అధికారులు ఖాళీ చేయమని చెప్పారని పేర్కొన్నాడు. దీంతో ఇంటి సామగ్రి అక్కడే వదిలి కొద్ది రోజులుగా వేరేచోట ఉంటున్నట్లు తెలిపాడు. ఇంట్లో సిలిండర్, ఫ్రిడ్జ్, ఫర్నిచర్ ఉండగా వాటిని దొంగలు ఎత్తుకెళ్లారని పేర్కొన్నాడు. మంగళవారం ఉదయం వెళ్లి చూసే సరికి తాళం పగలగొట్టి ఉందని, వస్తువులు కనిపించకుండా పోయాయని తెలిపాడు. ఈమేరకు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పంచాయతీ కార్మికుడికి కరెంటు షాక్



నిర్మల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సాయి క్రిష్ణ

లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాంద గ్రామ పంచాయతీ కార్మికుడు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. గ్రామ పంచాయతీలో సాయి క్రిష్ణ మల్టీపర్పస్ వర్కర్‌గా ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం గ్రామంలో విద్యుత్ బల్బులు పెట్టడానికి సాయి క్రిష్ణ తన తోటి కార్మికులతో కలిసి వెళ్లాడు. బల్బులు అమర్చే క్రమంలో షాక్‌కు గురయ్యాడు. తీవ్రంగా గాయపడ్డాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే సాయిక్రిష్ణ ప్రమాదానికి గురయ్యాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై మండల విద్యుత్ ఏఈ మహేశ్‌ను వివరణ కోరగా చింతల్‌చాంద సబ్‌స్టేషన్ జేఎల్ఎం దుర్గం తిరుపతికి పంచాయతీ కార్మికుడు సాయి క్రిష్ణ ఫోన్ చేసి ఎల్‌సీ తీసుకుని గ్రామంలో బల్బులు పెట్టాడని, తర్వాత జేఎల్ఎం దుర్గం తిరుపతికి ఫోన్‌చేసి ఎల్‌సీ రిటన్ చేశాడన్నారు. అనంతరం తమకు సమాచారం ఇవ్వకుండా మరోచోట 15 కేవీ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను ఆఫ్‌చేసి దానిపై విద్యుత్ పోల్‌కు బల్బును పెట్టడానికి స్తంభం ఎక్కుతుండగా 6.3 కేవీ విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురయ్యాడని వెల్లడించారు. స్తంభంపై నుంచి కిందపడడంతో తలకు గాయాలయ్యాయి. విద్యుత్ షాక్‌తో ఎడమ చేయి, మెడ, వీపు భాగం కాలింది. గ్రామస్తులు అతడిని నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం సాయిక్రిష్ణ చికిత్స పొందుతున్నాడు.

16 ఆటోలు సీజ్



సీజ్ చేసిన ఆటోలతో ఎంవీఐ హరింద్రకుమార్

ఎదులాపురం: సరైన ధ్రువపత్రాలు లేని 16 ఆటోలను సీజ్ చేసినట్లు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ హరింద్ర కుమార్ తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక బస్టాండ్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా ఫిట్‌నెస్, లైసెన్స్, ఇన్సూరెన్స్ తదితర పత్రాలు లేని 16 ఆటోలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

బాసరలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



బాసరలో హోమం నిర్వహిస్తున్న పండితులు..



దీప జ్యోతి వెలిగిస్తున్న వేదపండితులు..

బాసర: నిర్మల్ జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసరలో ముగ్గురు అమ్మవార్లు శ్రీమహాలక్ష్మి, మహాకాళి, సరస్వతి అమ్మవార్లకు మంగళవారం అంగారక చ తుర్థి ,సంకట హర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూ జలు నిర్వహించారు. మాసోత్సవ పూజ కలిసి రావడంతో అభిషేకం, అర్చన శ్రీసరస్వతి పూజ, చండీహోమం, వేద పారాయణం, విగ్నేశ్వర పూజ జరిపి ంచారు. చిన్నారులకు అక్షరాభ్యాసం, పూజలు నిర్వహిస్తే ఆ సరస్వతి అమ్మవారి ఆశీస్సుల తోపాటు శ్రీవిఘ్నేశ్వరుని ఆశీస్సులు ఉంటాయని వారికి విద్యాబుద్ధుల తోపాటు, ఉద్యోగం, వ్యాపారంలో అన్నిరంగాల్లో ఎదుగుతారని భక్తుల నమ్మకం.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు

- ఆదిలాబాద్ జిల్లా వాసి మృతి.. 28 మందికి గాయాలు
- కామారెడ్డిలో ఘటన



అఫ్సర్‌ఖాన్ (ఫైల్)



బస్సు క్యాబిన్‌లో అఫ్సర్‌ఖాన్ మృతదేహం

ఆదిలాబాద్‌టౌన్/కామారెడ్డి క్రైం: కామారెడ్డి జిల్లా కేంద్రం సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున రోడ్డుపై ఆగి ఉన్న లారీని ప్రైవేట్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, 28 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆదిలాబాద్‌కు చెందిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు 34 మంది ప్రయాణికులతో సోమవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో హైదరాబాద్‌కు బయలుదేరింది. మంగళవారం తెల్లవారుజామున దాదాపు 3 గంటల ప్రాంతంలో కామారెడ్డి సమీపంలోకి రాగానే క్యాసంపల్లి శివారులో జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న ఆదిలాబాద్‌లోని అంబేడ్కర్‌నగర్ కాలనీకి చెందిన అఫ్సర్‌ఖాన్ (25) మృతి చెందగా, మరో 28 మందికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో రూరల్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ షేక్ రఫీక్‌తోపాటు మరో ప్రయాణికుడు మోబీన్‌కు తీవ్ర గాయాలుకాగా వైద్యులు నిజామాబాద్‌కు రిఫర్ చేశారు. గాయాలపాలైన వారంతా ఆదిలాబాద్, నిర్మల్ ప్రాంతాలకు చెందిన వారే. అఫ్సర్‌ఖాన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నటట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు



క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

జైనథ్: మండలంలోని బెల్గాం వద్ద బైక్ అదుపు తప్పిన ఘటనలో భీంపూర్ మండలం గుంజాల గ్రామానికి చెందిన ఆత్రం భీంరావ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. భీంరావ్ మంగళవారం బేల నుంచి ఆదిలాబాద్ వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో బెల్గాం బ్రిడ్జి వద్ద బైక్ అదవు తప్పి కింద పడిపోయాడు. అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే శంకర్ తన వాహనాన్ని ఆపి 108కు సమాచారం అందించారు. బాధితుడిని బయటకు అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. ఈ ప్రమాదంలో బైక్ పూర్తిగా దెబ్బతినగా, భీంరావ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి.

పరస్పర దాడిలో ఇరువర్గాలపై కేసు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామం పోచంపాడు శివారులోని ఓ భూ వివాదంలో పరస్పర దాడిలో ఇరువర్గాలపై హాజీపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచంపాడు శివారులోని మూడు ఎకరాల భూమిలో నస్పూర్‌కు చెందిన బోరిగం వెంకటేశ్ విత్తనాలు నాటుతుండగా నస్పూర్‌కు చెందిన సామ్యూల్, అతడి సోదరుడు ప్రేమ్ సాగర్ అడ్డుకున్నారు. ఆ భూమి తమదంటే తమదని వాగ్వాదానికి దిగి గొడవ పడ్డారు. హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపైనొకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రైవేట్ చేతిలోకి కడెం హరిత రిసార్ట్



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న హరిత రిసార్ట్ సిబ్బంది

కడెం: మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌ను పర్యాటక శాఖ ప్రైవేటుకు అప్పగిచ్చింది. కడెం ప్రాజెక్టు పరిసరా ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో పర్యాటక శాఖ 2015లో ఇక్కడ 12 ఏసీ కాటేజీలతో రిసార్ట్ నిర్మించింది. తొమ్మిదేళ్లుగా టూరిజం కార్పొరేషన్ రిసార్ట్‌ను నడిపించింది. ప్రస్తుతం ఖానాపూర్‌కు చెందిన మాజీ ఏపీపీఎస్సీ సభ్యుడు పైడిపల్లి రవీందర్‌రావుకు అప్పగిస్తూ లేఖ విడుదల చేసింది. రిసార్ట్ ప్రైవేటుకు అప్పగించడంతో తాము ఉపాధి కోల్పోతామని సిబ్బంది తెలిపారు. ఈమేరకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

సెల్లార్ ప్రహరీ కూలి నలుగురికి గాయాలు

- ముందస్తుగా హెచ్చరించిన మున్సిపల్ కమిషనర్
- నోటీసులు అందజేసినా బేఖాతర్ చేసిన ఇంటి యజమాని



స్వల్పగాయాలతో రాములు



తీవ్రంగా గాయపడిన గంగరాజు



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ బన్సీలాల్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రం మంచిర్యాలలోని వెంకటేశ్వర టాకీస్ చౌరస్తా సమీపంలో మంగళవారం సెల్లార్ ప్రహరీ కూలి నలుగురు కూలీలు గాయపడ్డారు. ఇటీవల సెల్లార్ ప్రహరీ కూలి ముగ్గురు మృతిచెందిన ఘటన మరవకముందే మరో ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందిన వెన్నంపెల్లి లక్ష్మీనారాయణ నూతన భవన నిర్మాణం చేపడుతున్నాడు. సెల్లార్ కోసం పక్కనే ఇటుకలతో పది రోజుల క్రితం ప్రహరీ నిర్మించారు. పక్కనే సిమెంట్ పిల్లర్ల మధ్యలో మట్టి పనులు చేస్తుండగా ఒక్కసారిగా ఇటుకల ప్రహరీ కూలి కూలీలపై పడింది. దీంతో కాసిపేట మండలం ధర్మరావుపేటకు చెందిన అరికెల గంగారాజు తీవ్రంగా, శ్రీరాంపూర్‌కు చెందిన పశుల మల్లయ్య, సీతారామ్‌పల్లికి చెందిన ఐటిపాముల రాములు, సోమగూడంకు చెందిన నర్సయ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక సీఐ బన్సిలాల్ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసినట్లు తెలిపారు.

నోటీసులు ఇచ్చినా రక్షణ చర్యలు పాటించలేదు..

ఈ నెల 13న జిల్లా కేంద్రంలో సెల్లార్ ప్రహరీ కూలి ముగ్గురు కూలీలు దుర్మరణం చెందిన నేపథ్యంలో నూతనంగా భవన నిర్మాణాలు చేపడుతున్న ఇళ్ల యజమానులకు నోటీసులు ఇచ్చారు. పనుల్లో, సెల్లార్ నిర్మాణంలో కూలీలకు రక్షణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో లక్ష్మీనారాయణకు సైతం నోటీస్ అందజేశారు. అయినా నిబంధనలు బేఖాతర్ చేస్తూ కూలీలకు కనీస రక్షణ చర్యలు చేపట్టకపోవడంపై కమిషనర్ ఇంటి యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

పద్మనగర్‌లో చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని పద్మనగర్ కాలనీకి చెందిన అడేటి సాయికిరణ్ ఇంట్లో సోమవారం చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు నాలుగు తులాల బంగారం, 40 తులాల వెండి ఎత్తుకెళ్లారు. సీఐ రవీందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాయికిరణ్ తన తల్లి లక్ష్మి ఆరోగ్య బాగాలేకపోవడంతో మంచిర్యాలలోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. మంచిర్యాల నుంచి రాత్రి ఇంటికి వచ్చి తాళం తీస్తే రాలేదు. వెనుకాలకు వెళ్లి చూడగా తలుపు తెరిచి ఉంది. లోపలికి వెళ్లి చూ డగా బీరువా పగులగొట్టి బంగారం, వెండి నగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు. ఆదివాసీల భూముల కబ్జాపై చర్యలు తీసుకోవాలి

క్లుప్తంగా

ఎమ్మెల్యేకు సన్మానం



సన్మానిస్తున్న యువజన సంఘం సభ్యులు

బాసర: మండల కేంద్రంలోని జగ్జీవన్‌రావు యువజన సంఘం నాయకులు మంగళవారం ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్‌ను మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాలనీలోని సమస్యల గురించి వివరించారు. తమ సంఘానికి ఒక కమిటీ హాల్ నిర్మించాలని కోరారు.

వైకుంఠధామం పనుల పరిశీలన



పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్‌లో నిర్మిస్తున్న వైకుంఠధామం పనులను మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.20 లక్షల పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. చైర్మన్ వెంట కౌన్సిలర్ అయ్యన్న గారి రాజేందర్, తదితరులు ఉన్నారు.

ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

భైంసాటౌన్: దోస్త్ ద్వారా డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థులు విధిగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లేని పక్షంలో సీటు కోల్పోయే అవకాశముందన్నారు. దోస్త్ రిజిస్ట్రేషన్ సమయంలోనే ఆదాయ ధ్రువీకరణ పత్రం అప్‌లోడ్ చేస్తే కోరుకున్న కళాశాలల్లో ప్రవేశం పొందవచ్చన్నారు. ప్రస్తుతం మూడోవిడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ జులై 2 వరకు కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దోస్త్ కో ఆర్డినేటర్ గంగాధర్ తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశాలు

కుంటాల: కుంటాల మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ అప్క గజ్జారాం అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎంఏ రహీం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు, సంబంధిత శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

సారంగపూర్: సారంగపూర్ మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11:30 నిమిషాలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ శ్యామ్‌సుందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశంలో ఇప్పటివరకు మండలంలో జరిగిన అభివృద్ధి, సమస్యలు, ఇతర అంశాల ప్రస్తావన ఉంటుందన్నారు.

కథల పుస్తకాలు పంపిణీ



కథల పుస్తకాలతో విద్యార్థులు

కుభీర్: మండలంలోని చొండి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం రూమ్‌టూరీడ్ సంస్థ నిర్వాహకులు కథల పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచడానికి, సామర్థ్యం వెలికితీయడానికి దోహద పడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. విద్యార్థులు విరామ సమయంలో చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వర్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సంజీవ్, ఉపాధ్యాయులు భోజన్న, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పట్టాలు రద్దుచేయాలి



డీటీకి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

మామడ: మండలంలోని న్యూసాంగ్వి గ్రామ శివారులోని భూములకు అక్రమంగా ఇచ్చిన డీ1 పట్టాలు రద్దు చేయాలని కోరుతూ మంగళవారం గ్రామస్తులు డీటీ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో గ్రామస్తులు గంగాధర్, రాజేందర్, మహేష్, సాయన్న, లింగన్న, శ్రీనివాస్, వెంకటమ్మ, లలిత, తదితరులు ఉన్నారు.

అరకకు తగ్గని ఆదరణ



లక్ష్మణచాందలో అరకతో విత్తనాలు వేస్తున్న రైతు

- రోజుకు రూ.4 వేల నుంచి రూ.4,500 కిరాయి
- గ్రామాల్లో ఎద్దుల కొరతతో ఏర్పడిన డిమాండ్

లక్ష్మణచాంద: అన్నదాతలకు పంటల సాగులో కాడెద్లు కీలకపాత్ర పోషిస్తాయి. దుక్కి దున్నడం మొదలుకొని విత్తనాలు వేయడం, కలుపు తీయడం వంటి పనులకు ఎద్దులను రైతులు ఉపయోగిస్తున్నారు. పంటలను సాగు చేయడంలో ఎన్ని ఆధునిక యంత్రాలు వచ్చినా ఎద్దులకు ఉన్న ఆదరణ మాత్రం నేటికీ తగ్గడం లేదు. వివిధ రకాల పంటలు సాగు చేసే రైతులు విత్తనాలు వేయడం, కలుపు తీయడం, గుంటుక కొట్టడం వంటి అన్నిరకాల పనులు చేయడానికి ఎడ్లను వినియోగిస్తుండటంతో అరకకు డిమాండ్ పెరిగింది.

ఎద్దుల కొరత...

గతంలో ఎక్కువ సంఖ్యలో అరకలు ఉండటంతో అన్నదాతలు పంటల సాగులో ఒకరికొకరు సహకరించుకునే వారు. విత్తనాలు వేయడం, కలుపు తీయం వంటి పనులకు ఒక రైతు మరొక రైతుకు సహకరించుకునే వారు. కానీ నేడు చిన్న, సన్నకారు రైతులకు పశుపోషణ భారం కావడంతో గ్రామాల్లో ఎద్దుల సంఖ్య క్రమ క్రమంగా తగ్గిపోయింది. ప్రభుత్వం కూడా వ్యవసాయానికి రైతులకు తోడ్పాటు అందించేందుకు అనేక యంత్రాలను, ట్రాక్టర్లను సబ్సిడీపై అందివ్వడంతో చాలామంది రైతులు ట్రాక్టర్లు కొనుగోలు చేశారు. కానీ కొందరు రైతులు మాత్రం నేటికీ కాడెద్లతోనే వ్యవసాయం చేయడానికే మొగ్గు చూపుతున్నారు.

రోజుకు రూ.4వేల నుంచి రూ.4,500 కిరాయి

రైతులు విత్తనాలు వేయడానికి ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఎద్దులను తీసుకెళ్తే ఒక రోజుకు రూ.4వేల నుంచి రూ.4,500 వరకు చెల్లిస్తున్నారు. దీనికి తోడు కాడెద్ల రైతుకు ఖర్చులకు అదనంగా రూ.200 ఇస్తున్నారు. గ్రామాలలో ఎద్దుల అరకలు తక్కువగా ఉండటంతో కాడెద్ల అరక కావాల్సిన రైతులు అరక ఉన్న రైతు వద్ద ముందుగానే అడ్వాన్స్ ఇచ్చి తమకు ఈ రోజు అరుక కావాలని చెబుతున్నారు. దీంతో అరకలకు భలే డిమాండ్ ఏర్పడింది.

డబ్బులు ముందే ఇచ్చాం



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు విత్తనాలు వేస్తుండటంతో ఎద్దుల కొరతతో అరకకు డిమాండ్ ఏర్పడింది. దీంతో అరక ఉన్న రైతుకు ముందుగానే డబ్బులు ఇచ్చి పలానా రోజు అరక కావాలని బుక్ చేసుకుని మొక్కజొన్న విత్తనాలు వేశా.

– జగదీష్‌రెడ్డి, రైతు, పొట్టపెల్లి

అరక సాగే మేలు



విత్తనాలు వేసేందుకు ట్రాక్టర్ల కంటే కాడెద్లతోనే మేలు జరుగుతుంది. ట్రాక్టర్‌లో పొలం నలుమూలలకు వెళ్లడం కష్టం. కానీ ఎద్దుల అరకతో పొలంలోని నలు మూలలకు వెళ్లడమే కాకుండా చేనులో వేసిన మట్టిని ప్రతి మూలకు మళ్లించవచ్చు. మంచి దిగుబడులు కూడా వస్తాయి.

– సెవ్వ రవీందర్, యువ రైతు, లక్ష్మణచాంద

గ్రామాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



బీటీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పెంబి: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మందపల్లి నుంచి రాజూరా వరకు రూ.18 కోట్ల వ్యయంతో తలపెట్టిన 6.5 కిలోమీటర్ల బీటీరోడ్డు నిర్మాణానికి, పలేకరు వాగుపై రెండు వంతెనల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులు గత ప్రభుత్వ పాలనలో మంజురయ్యాయని కొందరు ప్రజలను మోసం చేస్తున్నారని, అలాంటి మాటలు నమ్మవద్దన్నారు. గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ గంగారెడ్డి, ఎంపీడీవో రమాకాంత్, నాయకులు పుప్పాల శంకర్, అశోక్‌రావ్, తులాల శంకర్, రమేశ్, రాజన్న, స్వామి, శ్రీకాంత్, గోవింద్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్ బెడ్రూం ఇళ్లు అప్పగించాలి’



మాట్లాడుతున్న నారాయణ్‌రావు పటేల్

భైంసాటౌన్: పట్టణ శివారులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను త్వరగా అప్పగించాలని కోరుతూ పలువురు మంగళవారం మాజీ ఎమ్మెల్యే బీ.నారాయణ్‌రావు పటేల్‌ను కలిశారు. ఆయన నివాసానికి వెళ్లి మాట్లాడారు. డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించినా అప్పగించకపోవడంతో అద్దె ఇళ్లలో ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన ఆర్డీవో కోమల్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు.

రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్



హాజరైన ఏడీఏ వీణ

లోకేశ్వరం: ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో మంగళవారం రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పంటల సాగు విధానం, చీడపీడల నివారణ, ఎరువుల యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. ఏడీఏ వీణ, ఏవో గణేశ్ హాజరయ్యారు.

ఆయిల్‌పాం తోటల పరిశీలన



పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ అధికారులు

దస్తురాబాద్: మండలంలోని మున్యాల, గొడిసిర్యాల, రాంపూర్ గ్రామాల్లోని ఆయిల్‌పాం తోటలను మంగళవారం జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి ఆలియా ఫాతిమా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్‌పాం తోటలు సాగు చేయాలనుకుంటున్న రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై మొక్కలు, బిందుసేద్యం పరికరాలు అందిస్తుందన్నారు. సాగుకు రైతులు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ మండల అధికారి మౌనిక, జిల్లా ప్రియూనిక్ కంపనీ జనరల్ మేనేజర్ మల్లేశ్వర్‌రావ్, ఏరియా మేనేజర్ వనోజ్, క్లస్టర్ ఆఫీసర్లు నవీన్, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికలు తయారు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో అబ్దుల్ సమద్

తానూరు: పదో విడత హరితహారానికి ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. వర్షాలు కురిస్తే అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ కూలీల ద్వారా మొక్కలు నాటించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మోహన్‌సింగ్, ఉపాధిహామీ ఏపీవో గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీరువా విరాళంగా ఇచ్చిన విద్యార్థులు



బీరువాతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

సోన్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు గతేడాది పొదుపు చేసుకున్న డబ్బులతో మంగళవారం పాఠశాలకు బీరువాను విరాళంగా ఇచ్చినట్లు హెచ్‌ఎం ఆరాధన తెలిపారు. తెలుగు ఉపాధ్యాయుడు నాగయ్య కుర్మే విద్యార్థులచేత చిరుతిళ్లు మాన్పించి ఆడబ్బులను స్థానిక బ్యాంకులో ఖాతా తెరిచి అందులో జమ చేయించాడు. పొదుపు చేసిన రూ.5 వేలతో బీరువాను కొనుగోలు చేసినట్లు తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఇలా వెళ్తే ఎలా?



వాహనదారులు అస్తవ్యస్తంగా వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారని భావించిన పోలీసులు ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ చౌరస్తాలో ఎస్పీ క్యాంపు కార్యాలయం ఎదుట బారికేడ్లు ఏర్పాటు చేశారు. కానీ వాహనదారులు నిబంధనలు బేఖాతరు చేస్తూ వాటి మధ్యలో నుంచి ఇలా ప్రమాదకరంగా వాహనాలు దాటిస్తున్నారు. ఆ దృశ్యాలను 'సాక్షి' కెమెరాలో క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్





సొంత భవనం అందుబాటులోకి వచ్చేనా?



సోన్‌లో నిర్మాణంలో ఉన్న కేజీబీవీ భవనం

- పనులు ప్రారంభించి నాలుగేళ్లు..
- నత్తనడకన సాగుతున్న పనులు..
- ఇదీ సోన్ కేజీబీవీ భవనం పరిస్థితి..



నిర్మాణంలో ఉన్న తాగునీటి ట్యాంకు

లక్ష్మణచాంద/సోన్: సోన్ నూతన మండలంగా ఏర్పాటు కావడంతో 2017లో సోన్ మండల కేంద్రానికి నూతనంగా కేజీబీవీ మంజూరైంది. 2017లోనే సోన్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల భవనంలో కేజీబీవీ ప్రారంభించారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, మూత్రశాలలు, డార్మెటరీ సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థుల ఇబ్బందుల దృష్ట్యా 2021లో సోన్ కేజీబీవీ బాలికల విద్యాలయాన్ని నిర్మల్ అర్బన్ మండలం సోఫీనగర్‌లోని కేజీబీవీకి మార్చారు. అప్పటి నుండి అక్కడే కొనసాగుతోంది.

కొనసాగుతున్న నూతన భవన నిర్మాణ పనులు

సోన్ మండల కేంద్రంలో కేజీబీవీకి సొంత భవనం నిర్మాణానికి రూ.3.15 లక్షలు మంజూరు చేశారు. అయితే అవి సరిపోకపోవడంతో మరో రూ.కోటి మంజూరయ్యాయి. 2019 లో భవనం నిర్మాణ పనులు ప్రారంభించారు. నాలుగేళ్లు గడిచినా పూర్తి కాలేదు.

చేయాల్సిన పనులు..

1. తాగు నీటి ట్యాంకు నిర్మాణం పూర్తి కాలేదు.
2. మూత్రశాలలు, తాగునీటి కుళాయిల వద్ద నల్లాలు బిగించ లేదు.
3. విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయలేదు.
4. చుట్టూ ప్రహరీ నిర్మాణం మొదలు కాలేదు.
5. ఫర్నీచర్ ఇంకా పాఠశాలకు చేరలేదు.

ఉన్నతాధికారులు త్వరగా పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇబ్బందుల మధ్యనే చదువులు

సోన్ మండల కేజీబీవీకి సొంత భవనం లేకపోవడంతో నిర్మల్ అర్బన్ కేజీబీవీకి మారడంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇబ్బందులు ఇవీ..

1. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేవు.
2. సరైన డార్మెటరీ సౌకర్యం లేదు.
3. బాలికలకు సరిపడా మూత్రశాలలు అందుబాటులో లేవు.
4. కిచెన్ షెడ్డు లేదు.

దీంతో నిత్యం ఇబ్బందుల మధ్యనే చదువు కొనసాగిస్తున్నామని విద్యార్థినులు పేర్కొంటున్నారు.

ఇబ్బందిగా ఉంది

కేజీబీవీ నూతన భవనం పనులు ప్రారంభించి నాలుగేళ్లయినా పూర్తికాకపోవడంతో నిర్మల్ అర్బన్ కేజీబీవీలో సోన్ కేజీబీవీ కూడా నిర్వహిస్తున్నాం. వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు విన్నవించాం. ఇటీవల కేజీబీవీని నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి సందర్శించారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. జూలై 10 వరకు కొత్త భవనం అందుబాటుల్లోకి తేవాలని ఎమ్మెల్యే కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

– లతాదేవి, కేజీబీవీ ఎస్‌వో

దోమల నివారణకు చర్యలు



జేసీబీతో పనులు చేయిస్తున్న చైర్మన్

ఖానాపూర్: పట్టణంలోని 12వ వార్డు పరిధిలో గల సుభాశ్‌నగర్ కాలనీలోని ఓపెన్‌ప్లాట్లలో నిలిచిన వర్షపు నీటిలో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. కౌన్సిలర్ ఫౌజియా షబ్బీర్ పాషా విషయాన్ని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన ఓపెన్ ప్లాట్ల ప్రాంతాల్లో జేసీబీతో తాత్కాలిక డ్రెయినేజీలు తీయించారు. వర్షపునీరు, మురుగు నీటిని మళ్లించి దోమల నివారణకు చర్యలు చేపట్టారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



రైతునేస్తం కార్యక్రమాన్ని తిలకిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: రైతునేస్తం కార్యక్రమంలో శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను పాటించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ రమేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రైతునేస్తం టెలీ కాన్ఫరెన్స్ కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా రైతుభరోసా కార్యక్రమంపై అభిప్రాయాలు సేకరించారు. మండల కేంద్రానికి చెందిన రైతులు సోన్‌కాంబ్లే గోపినాథ్ మాట్లాడుతూ.. 10 ఎకరాల లోపు వ్యవసాయ భూమి ఉన్న రైతులకే రైతు భరోసా పరిమితం చేయాలన్నారు. అనంతరం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా వివిధ రకాల పంటల సాగుపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు రాథోడ్ గణేష్, అరుణ, ఏఈవోలు వీర, మల్లేశ్, నవతేజ్, కరుణ, లత భారతి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

లోకేశ్వరం: మండలంలోని రాజూర ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదోతరగతికి వరకు విద్యాబోధన చేసేందుకు విద్యావలంటీర్లు దరఖాస్తు చేసుకోవాలని గ్రామాభివృద్ధి కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఆసక్తి గల టీచర్ ట్రెనింగ్ పొందిన నిరుద్యోగులు వీవీలుగా పని చేసేందుకు ఈ నెల 29న ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.